క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఈనెల 29న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ వరంగల్ టౌన్ డీఈ ఎస్.మల్లికార్జున్ తెలిపారు. ధర్మారం, పోతరాజుపల్లి, నర్సంపేట రోడ్డు ఇండస్ట్రీయల్ ప్రాంతం, జాన్‌పాక ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అయోధ్యపురం రైల్వే గేట్ మూసివేత

కాజీపేట రూరల్: కాజీపేట అయోధ్యపురం రైల్వే లెవెల్ క్రాసింగ్ గేట్ నంబర్ –58ను మరమ్మతుల కారణంతో మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు శనివారం తెలిపారు. ఈనెల 27నుంచి అక్టోబర్ 4వ తేదీ వరకు ఈ గేట్‌లో నుంచి వాహనాల రాకపోకలను నిలిపివేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

సొసైటీలో అవకతవకలు

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం జయగిరి గౌడ సంఘంలో అవకతవకలు చోటు చేసుకున్నాయని సభ్యులు ఆరోపించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ గౌడ సంఘంలో సుమారు 250 మంది సభ్యులు ఉన్నారని, 40ఏళ్లుగా ఈ సొసైటీ కొనసాగుతోందని చెప్పారు. ఈ సొసైటీకి 18 ఎకరాలు భూమి ఉందని, దాన్ని రెండేళ్ల క్రితం ఓ మాజీ ప్రజాప్రతినిధి కబ్జా చేశాడని సభ్యులు ఆరోపించారు. అందుకు కొంతమంది కుల సంఘం సభ్యులు సహకరించారని పేర్కొన్నారు. సొసైటీకి ఇప్పటివరకు బ్యాంకు ఖాతా లేదన్నారు. సొసైటీకి సంబంధించిన లెక్కల కోసం ప్రశ్నిస్తే కుల బహిష్కరణ చేస్తామని నిర్వాహకులు బెదిరిస్తున్నారని సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయమై సొసైటీ ఉపాధ్యక్షుడు రాజును ప్రశ్నించగా సొసైటీలో ఎలాంటి అవకతవకలు జరగలేదని, ప్రతిఏటా లెక్కలు వెల్లడిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారని సభ్యులు తెలిపారు.

కొత్తపల్లి శ్రీనివాస్‌కు డాక్టరేట్



ఖిలా వరంగల్: సామాజిక సేవారంగంలో విశిష్ట సేవలందించిన న్యాయవాది కొత్తపల్లి శ్రీనివాస్‌కు ఏషియా ఇంటర్నేషనల్ కల్చరల్ అకాడమీ, విజయన్ అకాడమీ ఫౌండర్ సంస్థలు సంయుక్తంగా డాక్టరేట్ ప్రకటించాయి. తమిళనాడు రాష్ట్రం హోసూరు పట్టణంలో జరిగిన ప్రదానోత్సవంలో హెడ్ కోచ్ అసిస్టెంట్ జడ్జి డాక్టర్ హరిదాస్ నుంచి డాక్టరేట్ పట్టాను శివనగర్ ప్రాంతానికి చెందిన కొత్తపెల్లి శ్రీనివాస్ అందుకున్నారు. సామాజిక, సేవ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన తనను గుర్తించి డాక్టరేట్ అందించినట్లు శ్రీనివాస్ తెలిపారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం



కాజీపేట అర్బన్: వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దరిచేరవని డాక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. భారత ప్రభుత్వం చేపట్టిన హెల్త్ ఇండియా కార్యక్రమాన్ని కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలోని శ్రీచైతన్య పాఠశాలలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరోగ్యమే మహాభాగ్యం అనే అంశంపై, సంపూర్ణ ఆరోగ్యానికి తీసుకోవాల్సిన ఆహార పదార్థాలపై విద్యార్థులకు ప్రవీణ్‌కుమార్ అవగాహన కల్పించారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ విద్య, ఏజీఎం రాజేశ్వర్ రెడ్డి, కోఆర్డినేటర్ శివకోటేశ్వర్, పాఠశాల ప్రిన్సిపాల్ అనిత, డీన్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన విద్యార్థులు



మడికొండ: మడికొండ పోలీస్‌స్టేషన్‌ను మాస్టర్జీ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లో ఉన్న రిసెప్షన్, ఎస్‌హెచ్‌ఓ చాంబర్, ఎస్సై రూమ్స్, లాకప్స్, పోలీసుస్టేషన్ పరిసరాల గురించి వారికి ఇన్‌స్పెక్టర్ కిషన్ వివరించారు. కార్యక్రమంలో ఎస్సై రాజబాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా సారయ్య

వరంగల్: పీఆర్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ఎన్నికైన మాలోతు సారయ్య శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్‌టీయూ నాయకులు కృషి చేస్తున్నారని తెలిపారు. తన నియామకానికి సహకరించిన వారికి సారయ్య కృతజ్ఞతలు తెలిపారు.

గుర్రపు డెక్కను తొలగించేదెప్పుడో..?

- అగర్త చెరువును కమ్మేసిన వైనం
- సమీపిస్తున్న బతుకమ్మ వేడుకలు
- చర్యలు చేపట్టని అధికారులు



అగర్త చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్క



బతుకమ్మ ఆడుతున్న మహిళలు (ఫైల్)

ఖిలా వరంగల్: తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ పండుగ. ఈ పండుగను ఘనంగా జరుపుకోవాలని మహిళలందరు భావిస్తారు. అక్టోబర్ 2న ఎంగిలి పూలు ప్రారంభమై తొమ్మిది రోజుల పాటు కొనసాగే బతుకమ్మ వేడుకలకు ఈ ప్రాంతంలో ఇంకా ఏర్పాట్లు చేయాల్సి ఉంది. ఇక్కడి మహిళలకు ఎప్పటిలాగే ఈసారి కూడా అసౌకర్యాలే స్వాగతం పలకనున్నాయి. అగర్త చెరువు అభివృద్ధి నోచుకోక గుర్రపు డెక్కతో దర్శనమిస్తోంది. ఈక్రమంలో బతుకమ్మ నిమజ్జనం సందర్భంగా మహిళలకు ఇబ్బందులు తప్పేలా లేవు.

దశాబ్దాలు ఇక్కడే బతుకమ్మ

వరంగల్ ఫోర్ట్‌రోడ్డులోని మెట్టు దర్వాజ బతుకమ్మ ఆట స్థలం అతిపురాతనమైంది. ఇక్కడికి ఐదు డివిజన్ల పరిధిలోని మహిళలు బతుకమ్మ ఆడనున్నారు. దశాబ్దాలుగా ఇరుకైన రోడ్డుపై ఇక్కడ బతుకమ్మ ఆడడం ఆనవాయితీగా వస్తోంది. బతుకమ్మ ఆట స్థలం కొంత మేర అభివృద్ధి జరిగినా చెరువు మాత్రం చెత్తాచెదారంతో నిండి గుర్రపు డెక్క విస్తరించి కనిపిస్తోంది. గతేడాది చెరువులో పూడిక తీసి అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చిన పాలకులు పట్టించుకోలేదు. ఈసారి కూడా పట్టించుకునే పరిస్థితి కనబడడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు.

బతుకమ్మలను నిమజ్జనం చేసేదెలా?

సద్దుల బతుకమ్మ సమీపిస్తోంది. చెరువులోని గుర్రపు డెక్కను ఇంకా తొలగించలేదు. ఈక్రమంలో మహిళలు చెరువులోకి దిగి బతుకమ్మలను ఎలా వేస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. సరైన మెట్లు లేక నీళ్లు కనిపించకపోవడంతో అతివలు ఇబ్బందులు ఎదుర్కొనే దుస్థితి నెలకొని ఉంది. గతేడాది అగర్త చెరువు పూడిక తీసి, చెరువుకు ఇరువైపులా మెట్లు ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీని ప్రజా ప్రతినిధులు నెరవేర్చలేదని మహిళలు వాపోతున్నారు.

గుర్రపు డెక్కను తొలగించాలి



మెట్టు దర్వాజ వద్ద అగర్త చెరువు అంతా గుర్రపుడెక్కతో నిండి నీళ్లు కనిపించడం లేదు. మురుగునీరు, చెత్తాచెదారంతో చెరువు నిండి ఉంది. బతుకమ్మ వేడుకలు సమీపిస్తున్నందున అధికారులు వెంటనే స్పందించి బతుకమ్మ నిమజ్జనం కోసం చెరువులో పూడిక తీయాలి. గుర్రపు డెక్క, చెత్తాచెదారాన్ని తొలగించి సుందరీకరణ పనులు చేపట్టాలి.

– జారతి మమత, రుద్రమాంబనగర్

భగత్‌సింగ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి



కేయూలో నివాళులర్పిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు



పోచమ్మమైదాన్ జంక్షన్‌లో ఏఐవైఎఫ్ నాయకులు



మడికొండ చౌరస్తాలో భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శివాజీ సేన నాయకులు



19వ డివిజన్‌లో ప్రజా సంఘాల నాయకులు..

భగత్‌సింగ్‌ను నేటితరం స్ఫూర్తిగా తీసుకోవాలని పలువురు సూచించారు. స్వాతంత్ర్య యోధుడు భగత్‌సింగ్ జయంతి వేడుకలను నగర వ్యాప్తంగా శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశం కోసం పోరాటాలు చేసి, చిన్న వయస్సులోనే ప్రాణాలర్పించిన భగత్‌సింగ్ పోరాటం యువతకు ఆదర్శం అని తెలిపారు.

– సాక్షి నెట్‌వర్క్

నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలి



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

హన్మకొండ: విద్యార్థులు నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సూచించారు. హనుమకొండ వడ్డెపల్లిలోని పింగిళి ప్రభుత్వ బాలిక జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డేను శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థుల వసతి కోసం జూనియర్ కళాశాల సమీపంలో ఎస్సీ బాలికల హాస్టల్ ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కళాశాలలో ఆడిటోరియం నిర్మాణానికి, మైదానాన్ని చదును చేసి వినియోగంలోకి తీసుకొచ్చేందుకు నిధులు మంజూరు చేయిస్తానన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పి.కవిత, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఎ.శ్రీనివాస్, పి.శ్రీదేవి, అజయ్ కుమార్, మాజీ కార్పొరేటర్ ఎ.నాగరాజు, డివిజన్ అధ్యక్షుడు తాళ్లపల్లి సుధాకర్, ఎ.పున్నంచందర్, తాళ్లపల్లి మేరీ, మండల సమ్మయ్య, మొహమ్మద్ ముస్తాక్ నేహాల్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

'పింగిళి'లో ముగిసిన జాతీయ సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ లావణ్య

విద్యారణ్యపురి: హనుమకొండలోని ప్రభుత్వ పింగిళి మహిళా డిగ్రీ కళాశాలలోని హిస్టరీ విభాగం ఆధ్వర్యంలో రెండురోజులుగా తెలంగాణ 12వ శతాబ్దం నుంచి 20వ శతాబ్దం వరకు నాటి సమాజం, ఆర్థికం, సంస్కృతి అనే అంశాలపై నిర్వహిస్తున్న జాతీయ సదస్సు శనివారం ముగిసింది. ముగింపు సదస్సులో ఉస్మానియా యూనివర్సిటీ హిస్టరీ విభాగం ప్రొఫెసర్ లావణ్య మాట్లాడుతూ సామాజిక ఆర్థిక సాంస్కృతికంగా ఘనమైన చరిత్ర ఉందని గుర్తుచేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమౌళి, సదస్సు కోఆర్డినేటర్ డాక్టర్ కొలిపాక శ్రీనివాస్, బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ శ్రీనివాస్, కేడీసీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ సుహాసిని, డాక్టర్ సురేష్‌బాబు, అకడమిక్ కోఆర్డినేటర్ అరుణ పాల్గొన్నారు.

గురుకుల పూర్వ విద్యార్థినుల సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వ విద్యార్థినులు

విద్యారణ్యపురి: మడికొండలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాల పూర్వ విద్యార్థినుల సమ్మేళనం (1995 – 2000వ బ్యాచ్) కాకతీయ యూనివర్సిటీ సమీపంలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో శనివారం జరిగింది. ఈ సందర్భంగా వారంతా ఒకచోట కలుసుకుని అప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకున్నారు. పరస్పరం యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. గురువులను ఘనంగా సన్మానించారు. సమ్మేళనంలో రిటైర్డ్ ప్రిన్సిపాల్ రమాదేవి, రిటైర్డ్ అధ్యాపకుడు రాధాకృష్ణ, అధ్యాపకులు మల్లారెడ్డి, విశ్వనాథ్, పద్మజ, రజిత, ఉపాధ్యాయులు, నిర్వాహకులు, పూర్వ విద్యార్థినులు పరంజ్యోతి వేదవతి, శోభారాణి, చైతన్య, సోని, కాంత తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు క్రీడాసామగ్రి అందజేత



క్రీడా వస్తువులను అందజేస్తున్న దాతలు

వరంగల్: వరంగల్ ఎల్‌బీనగర్‌లోని మసూంఅలీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు అవసరమైన క్రీడా సామగ్రిని వాసవి క్లబ్ వరంగల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ జి.సాంబమూర్తి శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాసవి క్లబ్ సేవ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం, క్లబ్ ప్రతినిధులు నాగభూషణం, సత్యనారాయణ, సంపత్, కమలాకర్, భిక్షపతి పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

వరంగల్ కొత్తవాడలోని ప్రభుత్వ గిర్మాజీపేట ఉన్నత పాఠశాలలోని తల్లిదండ్రులు లేని పేద విద్యార్థులకు ఏజే పెడల్స్ సంస్థ ఆధ్వర్యంలో మట్టెవాడ ఇన్‌స్పెక్టర్ తుమ్మ గోపి చేతుల మీదుగా సైకిళ్లను దాతలు అవినాష్, జయంత్ అందజేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ గోపి మాట్లాడుతూ పాఠశాలలో చదివే విద్యార్థులు ఆర్థికంగా పేదలే కానీ, మేధస్సులో ఎంతో ధనికులని కొనియాడారు.

విద్యార్థులు సత్సంబంధాలు కలిగి ఉండాలి



వేడుకల్లో మూగల కుమార్, ఉపాధ్యాయులు

హన్మకొండ: విద్యార్థులు సత్సంబంధాలు కలిగి ఉండాలని షైన్ విద్యాసంస్థల చైర్మన్ మూగల కుమార్ యాదవ్ అన్నారు. హనుమకొండ హంటర్ రోడ్డులోని డీ కన్వెన్షన్ హాల్‌లో షైన్ జూనియర్ కళాశాల విద్యార్థుల ఫ్రెషర్స్ డే శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉంటూ చదువుపై శ్రద్ధ వహించాలన్నారు. చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు మారబోయిన రాజు గౌడ్, కె.శ్రీనివాసన్, ప్రశాంత్, సంధ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేద విద్యార్థుల అభ్యున్నతికి కృషి



నోట్‌బుక్స్ పంపిణీ చేస్తున్న పూర్వ విద్యార్థులు

ఖిలా వరంగల్: మై స్కూల్ మై సపోర్ట్ అనే కొత్త భావనతో పేద విద్యార్థుల అభ్యున్నతికి మరింత కృషి చేస్తామని పూర్వ విద్యార్థి, సీనియర్ జర్నలిస్ట్ శెంకేసి శంకర్‌రావు అన్నారు. వరంగల్ శంభునిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం వీర ఉపేందర్ అధ్యక్షతన పూర్వ విద్యార్థి మండల పరశురాములు ఆధ్వర్యంలో విద్యార్థులకు శనివారం నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శంకర్‌రావు మాట్లాడుతూ చదువుకున్న పాఠశాలను అభివృద్ధి చేయాలని, ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు చేయూతనివ్వాలనే ఉద్దేశంతో నోటుబుక్స్ పంపిణీ చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీందర్, సత్యనారాయణ స్వామి, ఇందిర, లక్‌పతి, రఫీక్ పాల్గొన్నారు.

నేడు 'డయల్ యువర్ డీఎం'

హన్మకొండ: ప్రయాణికులకు మెరుగైన, నాణ్యమైన సేవలు అందించడంతోపాటు సలహాలు, సూచనలు స్వీకరించేందుకు ఈనెల 29న 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ వరంగల్–1 డిపో మేనేజర్ వంగల మోహన్‌రావు తెలిపారు. హైదరాబాద్, నిజామాబాద్, సిద్దిపేట, పాలకుర్తి, తరిగొప్పుల రూట్ ప్రయాణికులు ఆదివారం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు 99592 26047 నంబర్‌కు ఫోన్ చేసి సమస్యలు తెలియజేయాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

ఖాళీల వివరాలు అందించాలి

వరంగల్: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల క్యాడర్లు, ఖాళీల వివరాలను ఎంఈఓలు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో అందించాలని వరంగల్ డీఈఓ జ్ఞానేశ్వర్ అన్నారు. హనుమకొండ సుబేదారిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం జరిగిన ఎంఈఓలు, స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎంల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల రికగ్నిషన్ కాపీలను రెండు రోజుల్లో అందించాలని పేర్కొన్నారు. సీఆర్పీలు విధిగా స్కూల్ కాంప్లెక్స్‌లోని అటెండెన్స్ రిజిష్టర్లలో సంతకం చేయాలని సూచించారు. ఎంఈఓలు పాఠశాలలను సందర్శించే సమయంలో సీఆర్పీలను మాత్రమే తీసుకువెళ్లాలని కోరారు. సమావేశంలో డీసీఎంఓ కుడికాల సుభాష్, ప్లానింగ్ కోఆర్డినేటర్ విజయ్‌కుమార్, అకౌంట్స్ ఆఫీసర్ సురేఖ, పరీక్షల విభాగం కార్యదర్శి కృష్ణమూర్తి, ఏఎంఓ సృజన్ రేఖ, ఎంఈఓలు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

మోడల్‌గా కనకదుర్గ కాలనీ పార్కు

హన్మకొండ: హనుమకొండ కనకదుర్గ కాలనీలోని పార్కును మోడల్ పార్కుగా అభివృద్ధి చేయనున్నట్లు వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి, మున్సిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాఖడే, కాలనీవాసులతో కలిసి పార్కును శనివారం కడియం కావ్య సందర్శించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గుజ్జుల వసంత, కాలనీ అభివృద్ధి కమిటీ బాధ్యులు, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సెంటర్‌లో గ్రీన్ డే

మడికొండ: హనుమకొండ ప్రాజెక్ట్ మడికొండ సెక్టార్ రాంపూర్‌లోని అంగన్‌వాడీ సెంటర్‌లో శనివారం గ్రీన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్ శారద, ఆయాలు, బాలింతలు, గర్భిణులు ఆకుపచ్చ రంగు చీరలు ధరించారు. అలాగే, పిల్లలు గ్రీన్ కలర్‌తో డ్రాయింగ్ వేశారు. కార్యక్రమంలో గడ్డం రమాదేవి, చంద్రమ్మ, చిన్నారులు, తల్లులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలను అమలు చేస్తా..



పద్మాక్షికాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే నాయిని

హన్మకొండ చౌరస్తా: తమది మాటల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని, ఇచ్చిన ప్రతీ హామీని అమలుచేసి తీరుతామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండలోని 9, 10వ డివిజన్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణ పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ 10వ డివిజన్ అధ్యక్షుడు కుమార్‌యాదవ్, యూత్ కాంగ్రెస్ నాయకుడు తోట పవన్, మంద రాకేష్, బొంత రామకృష్ణ, కొటిల్‌రెడ్డి, ఎల్లయ్య పాల్గొన్నారు.

నయీంనగర్: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా ముందుకెళ్తున్నట్లు ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అన్నారు. 54వ డివిజన్ కేయూ మొదటి గేట్ వద్ద రూ.5 లక్షలతో నిర్మించనున్న డ్రెయినేజీ పనులకు శనివారం శంకుస్థాపన చేశారు. కార్పొరేటర్లు గుంటి రజిత, తోట వెంకటేశ్వర్లు, పోతుల శ్రీమాన్, నాయకులు శ్రీనివాస్, సతీష్, చీకటి ఆనంద్ పాల్గొన్నారు.

న్యూశాయంపేట: మైనార్టీలకు ఇచ్చిన హామీలను ప్రాధాన్యత క్రమంలో నెరవేరుస్తానని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. హనుమకొండలో మైనార్టీ ఇంటలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు డాక్టర్ అనీస్ సిద్దిఖీ గృహంలో ఫోరం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమావేశంలో కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు పనిభద్రత కల్పించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న కార్మికులు

హన్మకొండ అర్బన్: కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, నాన్ పర్మినెంట్ కార్మికులకు పనిభద్రత కల్పించాలని సీఐటీయూ నాయకులు, కార్మికులు డిమాండ్ చేశారు. ఈమేరకు హనుమకొండ కలెక్టరేట్ ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు టి.ఉప్పలయ్య మాట్లాడుతూ మున్సిపల్, ఇతర ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్, ఇతర పద్ధతుల్లో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వం పనిభద్రత కల్పించాలని సూచించారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలన్నారు. కేంద్రం తీసుకువస్తున్న కొత్త కార్మిక చట్టలు కార్మికులకు తీవ్ర అన్యాయం చేసే విధంగా ఉన్నాయని విమర్శించారు. ధర్నాలో నాయకులు బరుపట్ల మహేష్, యాస బాబు, మాతంగి నవనీత, రెంటాల కోటి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ సభలను విజయవంతం చేయాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఈసం నారాయణ, బాదావత్ రాజు, నాయకులు

కేయూ క్యాంపస్: ప్రగతిశీల ప్రజాస్వామిక విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) మహాసభలను విజయవంతం చేయాలని ఉమ్మడి వరంగల్ జిల్లా పీడీఎస్‌యూ నాయకులు కోరారు. ఈమేరకు వార్షికోత్సవ వాల్‌పోస్టర్లను కాకతీయ యూనివర్సిటీలోని పరిపాలన భవనం వద్ద శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కేయూ ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ, మానవ హక్కుల వేదిక రాష్ట్ర కార్యదర్శి బాదావత్ రాజులు, బార్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తీగల జీవన్‌కుమార్ మాట్లాడారు. విద్యారంగ సమస్యలు, శాస్త్రీయ విద్యావిధానం కోసం పీడీఎస్‌యూ పోరాడుతోందని వివరించారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ మాజీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నున్నా అప్పారావు, అడ్వకేట్ నబి, రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరెడ్డి, బాధ్యులు సాంబ, మిశ్రీన్ సుల్తానా, రంజిత్, కేయూ అధ్యక్షుడు మర్రి మహేష్, ప్రధాన కార్యదర్శి గణేష్, వంశీ, డానియల్, పవన్, యుగేందర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

తూర్పుకోట రోడ్డును అభివృద్ధి చేయాలి

ఖిలా వరంగల్: కంకరపోసి వదిలేసిన తూర్పుకోట రోడ్డును పనులను వెంటనే పూర్తి చేయాలని ఎంసీపీఐ (యూ) జిల్లా సహాయ కార్యదర్శి నర్ర ప్రతాప్, నగర కార్యదర్శి సుంచు జగదీశ్వర్ డిమాండ్ చేశారు. ఈమేరకు వరంగల్ తూర్పుకోట రోడ్డుపై శనివారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఐతం నాగేష్, మల్లికార్జున్, రవి, ఐలయ్య, నరసయ్య, రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

హసన్‌పర్తి: 56వ డివిజన్ గోపాలపూర్‌లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఏఈ విజయలక్ష్మి అన్నారు. గోపాలపూర్ జంక్షన్‌లో పైపులైన్ లీకేజీలను అరికట్టాలని, మురుగునీటి కాల్వలను శుభ్రం చేయాలని అధికారులకు సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో ఏఈ శనివారం సందర్శించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి తేరాల యుగంధర్, కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులు నాగరాజు, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ

ఖిలా వరంగల్: ఉర్సు రంగలీల మైదానంలో నిర్వహించనున్న సద్దుల బతుకమ్మ, దసరా వాల్‌పోస్టర్లను ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నాగపూరి సంజయ్ బాబు, సభ్యుల ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు శనివారం ఆవిష్కరించారు. ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి మేడిది మధుసూదన్, కోశాధికారి మండ వెంకన్నగౌడ్, ట్రస్ట్ చైర్మన్ వంగరి కోటేశ్వర్, ఉపాధ్యక్షుడు గోనె రాంప్రసాద్, శివమూర్తి, రంజిత్, సందీప్ పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాలలో స్వచ్ఛత హీ సేవ

కేయూ క్యాంపస్: హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ విభాగం ఆధ్వర్యంలో స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల పరిసర ప్రాంతాల్లోని ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు, చెత్తాచెదారాన్ని ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు తొలగించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జ్యోతి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు శ్రీదేవి, మాదాసి కనకయ్య, చందులాల్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మెట్టుగుట్టపై రామకోటి స్తూపానికి అర్చనలు

మడికొండ: ఏకాదశి సందర్భంగా మెట్టుగుట్టపై ఉన్న శ్రీరామకోటి స్తూపానికి శనివారం ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామకోటి పుస్తకాలను అందులో నిక్షిప్తం చేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రతీ ఏకాదశి రోజున నిర్వహిస్తామని నిర్వాహకులు వివరించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు విష్ణువర్ధనాచార్యులు, సత్యనారాయణ శర్మ, కార్యనిర్వహణాధికారి శేషభారతి, ఆలయ చైర్మన్ పైడిపాల రఘుచందర్, ధర్మకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

రెండు కార్లు ఢీ

ఖిలా వరంగల్: వరంగల్ ఫోర్ట్ రోడ్డు మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ సమీపంలో మలుపు వద్ద రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొట్టాయి. దాంతో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన వారు ఆటోలో ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు.

రోడ్డుపై డీసీఎంతో ఇబ్బందులు



దేశాయిపేట: వరంగల్ 13 డివిజన్ గణేష్‌నగర్‌లో వాటర్ బాటిళ్ల డిస్ట్రిబ్యూటర్ కొద్ది రోజులుగా రోడ్డుపై డీసీఎం వాహనాన్ని నిలిపి పెట్టి లోడింగ్, అన్‌లోడింగ్ పనులు చేస్తున్నాడు. దాంతో ఆ మార్గంలో వెళ్లే వాహనదారులు, పాదచారులు, స్కూల్ బస్ డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని స్థానిక కార్పొరేటర్ సురేష్‌కుమార్ జోషి దృష్టికి స్థానికులు శనివారం తీసుకెళ్లారు. ఆయన వెంటనే స్పందించి సదరు డిస్ట్రిబ్యూటర్‌ను మందలించడంతో పాటు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈక్రమంలో రోడ్డుకు అడ్డంగా ఉన్న వాహనాన్ని డ్రైవర్ పక్కకు తీశాడు.